క్లుప్తంగా

గూడెంలో కాంగ్రెస్ నాయకుల పూజలు



మొక్కులు చెల్లిస్తున్న నాయకులు

దండేపల్లి: ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మంచిర్యాల ఎమ్మెల్యేగా కొక్కిరాల ప్రేంసాగర్‌రావు భారీ మెజార్టీతో గెలుపొందాడు. దీంతో ఆయన గెలుపునకు సంబంధించి దండేపల్లి మండల కాంగ్రెస్ నాయకులు మామిడిపల్లి శ్రీ భక్తాంజనేయస్వామి ఆలయంలో 51 కొబ్బరి కాయలు, గూడెం శ్రీ సత్యనారాయణస్వామి ఆలయంలో శనివారం 101కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. ఎంపీపీ శ్రీనివాస్, పార్టీ జిల్లా నాయకుడు త్రిమూర్తి, పార్టీ మండల అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ శ్రీనివాస్, నాయకులు రాంచందర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆటవిడుపు



జన్నారం: నిత్యం బిజీగా గడిపే విద్యార్థుల తల్లిదండ్రులకు విశ్రాంతి ఇచ్చేందుకు జన్నారం మండల కేంద్రంలోని స్లేట్ హైస్కూల్‌లో శనివారం ఆటవిడుపుగా ఆటల పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎస్సై సతీశ్ ప్రారంభించారు. తల్లిదండ్రులకు కబడ్డీ, షటిల్, క్యారమ్, చెస్, పోటీలు నిర్వహించారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ముందస్తుగా, ఆట విడుపు కోసం ఈ పోటీలు నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ ఏనుగు శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

రెబ్బెన: కరీంనగర్‌కు చెందిన సన్‌షైన్ ఆసుపత్రి ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయం ఆవరణలో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. పంచాయతీ పరిధిలోని ప్రజలు వైద్య శిబిరానికి హాజరై వైద్యపరీక్షలు చేయించుకున్నారు. సిబ్బంది రోగులకు బీపీ, షుగర్, ఈసీజీ పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సర్పంచ్ బొమ్మినేని అహల్యాదేవి, ఉప సర్పంచ్ మడ్డి శ్రీనివాస్‌గౌడ్, వార్డు సభ్యులు, బీఆర్‌ఎస్ నాయకులు శ్రీధర్, రాజేష్, శంకరమ్మ, అన్నపూర్ణ అరుణ, మురళీగౌడ్, పద్మ, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కంకలమ్మ ఆలయంలో పూజలు

కౌటాల: కంకలమ్మ ఆలయ మహాజాతరలో భాగంగా శనివారం ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయంలో వేదపండితుల ఆధ్వర్యంలో మహిళలు భక్తిశ్రద్ధలతో మహాయజ్ఞం నిర్వహించారు. ఆలయంలో భక్తులు కూష్మాండ బలిహారణము, కళానాస్యము నిర్వహించారు. మహా పూర్ణాహుతి, అపబృథ స్నానము, మహదాశీర్వచనం కార్యక్రమాలతో పాటు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

బడి బయట పిల్లలను గుర్తించాలి

ఆసిఫాబాద్‌రూరల్: బడి బయట పిల్లల గుర్తింపు సర్వే ఈ నెల 11 నుంచి జనవరి 10 వరకు నిర్వహించనున్నట్లు ఎస్‌వో శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తును తీర్చిదిద్దేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్బంధ విద్యాహక్కు చట్టాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సర్వే ద్వారా 15 నుంచి 19 ఏళ్ల బడి బయట పిల్లలను సీఆర్‌పీలు ఇంటింటి సర్వే చేసి గుర్తించి బడిలో చేర్పించాలని తెలిపారు.

అయోడిన్ పరీక్షలపై అవగాహన



వాంకిడి: మండలంలోని ఖైరీట్ గ్రామంలో శనివారం ఆరోగ్య విస్తరణ అధికారి పెందుర్ రవిదాస్ అయోడిన్ పరీక్షలు నిర్వహించారు. వంటల్లో వాడే ఉప్పులో అయోడిన్ శాతం ఎలా తెలుసుకోవాలో అక్కడి ఆశ వర్కర్‌కు వివరించారు. మోతాదుకు మించి అయోడిన్ వాడకం వల్ల కలిగే దుష్ప్రభావాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. గ్రామంలోని పాఠశాల విద్యార్థులకు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై సూచనలిచ్చారు. గ్రామ పరిసరాల్లో డ్రైడే నిర్వహించారు. వైద్య శిబిరం ఏర్పాటు చేసి మందులు పంపిణీ చేశారు.

అభివృద్ధి అసంపూర్తి

- ఎమ్మెల్యే వివేక్‌కు సమస్యల స్వాగతం
- పెండింగ్‌లో మిషన్ భగీరథ పనులు
- రూ. 53 కోట్లు మంజూరైనా ప్రారంభం కాని అంతర్గత రోడ్లు
- వేధిస్తున్న కాళేశ్వరం బ్యాక్ వాటర్ సమస్య



మందమర్రిలో పూర్తి కాని ఇంటిగ్రేటెడ్ మార్కెట్

చెన్నూర్: నియోజకవర్గంలోని సమస్యలు ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామికి స్వాగతం పలుకుతున్నాయి. పాఠశాలల పునరుద్ధరణ పనులు పూర్తికాకపోవడంతో పాటు పీజీ కళాశాల లేక విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చిన్నతరహా పరిశ్రమలు లేక ఉపాధి కోసం యువత పట్టణాలకు వలస వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. నియోజకవర్గం చుట్టూ గోదావరి, ప్రాణహిత నదులున్నా ఎత్తిపోతల పథకాలు లేక రైతులు సాగునీటికి తండ్లాడుతున్నారు. మిషన్ భగీరథ పనులు పూర్తి కాకపోవడంతో తాగునీటి కోసం ప్రజలు అవస్థలు పడుతున్నారు. విద్య, వైద్య సమస్యలు వేధిస్తున్నాయి. నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్యే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారని ప్రజలు గంపెడాశతో ఉన్నారు.

చెన్నూర్‌లో...

మండలంలో మిషన్ భగీరథ పనులు పూర్తి కాలేదు. తాగునీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మిషన్ భగీరథ పనులు పూర్తి చేయించాలి. 'మనఊరు–మనబడి' పాఠశాల పునరుద్ధరణ పనులు పూర్తి కాలేదు. దీంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. పునరుద్ధరణ పనులపై దృష్టి సారించాలి. చెన్నూర్ మున్సిపాలిటీకి అభివృద్ధి పనులకు రూ.53కోట్లు మంజూరయ్యాయి. పనులు ప్రారంభం కావాల్సి ఉంది. చెన్నూర్‌లో నిర్మించిన 50పడకల ఆసుపత్రిలో పూర్తి స్థాయి సిబ్బంది, పరికరాలు సమకూర్చాల్సి ఉంది.



పోచమ్మ గుడి వద్ద తాగునీరు తెచ్చుకుంటూ..

భీమారంలో...

మండలంలో 9500ఎకరాలకు సాగు నీరందించేందుకు నిర్మించిన గొల్లవాగు ప్రాజెక్ట్ ద్వారా రైతులకు 7ఎకరాలకు సాగునీరందుతోంది. మరో 2500ఎకరాలకు సాగునీరందించాలంటే పిల్ల కాలువలు నిర్మించాల్సి ఉంది. మండలంలో త్రీఫేజ్ కరెంట్ సమస్య పరిష్కారం కాలేదు. 24గంటల త్రీఫేజ్ కరెంట్ సమస్య వేధిస్తోంది. మిషన్ భగీరథ పనులు పూర్తి కాలేదు.



పూర్తి కాని గొల్లవాగు ప్రాజెక్ట్ పిల్ల కాలువ

కోటపల్లిలో...



కాళేశ్వరం వల్ల కొట్టుకుపోయిన పంట

మండలంలో కాళేశ్వరం బ్యాక్ వాటర్‌తో పంటలు తీవ్రంగా దెబ్బతిని రైతులు నష్టపోతున్నారు. సుపాక, వెంచపల్లి గ్రామాల్లో త్రీఫేజ్ విద్యుత్ సమస్య ఉంది. అంతర్రాష్ట్ర చెక్ పోస్ట్ ఏర్పాటు చేయాలి.

మందమర్రిలో...

మందమర్రి మండలంలో మున్సిపల్ ఎన్నికలు నిర్వహించాలి. పెండింగ్‌లో ఉన్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్, కేసీఆర్ పార్క్, ఇతర పనులు పూర్తి చేయించాలి. దళితుల ఉపాధి కోసం లెదర్ పార్క్ ప్రారంభించాలి. ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించాలి.



ప్రారంభం కాని లెదర్ పార్క్

జైపూర్‌లో...

మండల కేంద్రంలో గల పవర్ ప్లాంట్ ప్రభావిత గ్రామాలకు చెందిన నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించాలి. టేకుమట్ల వాగుపై వంతెన నిర్మించాలి. శివ్వారం మొసళ్ల కేంద్రాన్ని పర్యాటకశాఖకు అప్పగించి పర్యాటక కేంద్రంగా మార్చాలి.

'ఒంటరిగా పోటీ చేస్తాం'



కేక్ కట్ చేస్తున్న ఐఎన్టీయూసీ నాయకులు

శ్రీరాంపూర్: సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో తాము ఒంటరిగానే పోటీ చేస్తామని ఐఎన్టీయూసీ కేంద్ర సీనియర్ ఉపాధ్యక్షుడు శంకర్‌రావు తెలిపారు. శనివారం ఆయన ఆర్కే 5బి గనిపై నిర్వహించిన గేట్ మీటింగ్‌లో కార్మికులనుద్దేశించి మాట్లాడారు. ఈ ఎన్నికల్లో తాము ఏఐటీయూసీతో ఎలాంటి పొత్తు ఉండటం లేదన్నారు. గత ఎన్నికల్లో తాము ఏఐటీయూసీకి మద్దతిచ్చి గెలిపిస్తే పొత్తు ధర్మం పాటించకుండా నష్టం చేశారన్నారు. ఏఐటీయూసీ గెలిచిన కార్మికులకు ఎలాంటి ప్రయోజనం ఉండదన్నారు. వారికి రాజకీయ పరమైన బలం, నిర్మాణం లేదన్నారు. కావున గెలిచిన కార్మికులకు ఎలాంటి న్యాయం జరగదన్నారు. ఐఎన్టీయూసీ ఎన్నికల్లో చెప్పిన మేనిఫెస్టోను పూర్తి స్థాయిలో అమలు చేస్తామన్నారు. ఐఎన్టీయూసీ గెలిస్తేనే సింగరేణి మనుగడ సాధిస్తుందన్నారు. ఈ సందర్భంగా సీహెచ్‌పీ చెందిన పలువురు కార్మికులు ఐఎన్టీయూసీలో చేరారు.

ఘనంగా సోనియా పుట్టిన రోజు వేడుకలు..
ఈ సందర్భంగా సోనియాగాంధీ పుట్టినరోజు వేడుకలను ఆ యూనియన్ నేతలకు ఘనంగా నిర్వహించారు. పలు గనులపై ఈ కార్యక్రమాలు జరిగాయి. కార్యక్రమంలో ఆ యూనియన్ కేంద్ర ఉపాధ్యక్షుడు కలవేని శ్యాం, డెప్యూటీ ప్రధాన కార్యదర్శి గరిగె స్వామి, తిరుపతిరెడ్డి, బ్రాంచీ ఉపాధ్యక్షుడు శంకర్‌రావు, నాయకులు శీలం చిన్నయ్య, ఆకుల రాజన్న, అన్‌రెడ్డి సమ్మిరెడ్డి, కాలిపాక సమ్మయ్య, మనోజ్, పీ మల్లారెడ్డి, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

గడ్డం బ్రదర్స్‌కు మంత్రి వర్గంలో చోటు కల్పించాలి

బెల్లంపల్లి: బెల్లంపల్లి, చెన్నూర్ ఎమ్మెల్యేలైన గడ్డం వినోద్, వివేక్‌లకు రాష్ట్రమంత్రి వర్గంలో చోటు కల్పించాలని తెలంగాణ మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసర్ల యాదగిరి, ఉపాధ్యక్షుడు సబ్బని రాజనర్సు ప్రభుత్వాన్ని కోరారు. బెల్లంపల్లి ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గతంలో రాష్ట్ర కార్మిక శాఖమంత్రిగా పని చేసిన అనుభవం బెల్లంపల్లి ఎమ్మెల్యే వినోద్‌కు ఉందన్నారు. ఆయన మంత్రిగా పని చేసిన కాలంలో జిల్లా ఎంతగానో అభివృద్ధి సాధించిందని తెలిపారు. పెద్దపల్లి పార్లమెంట్ సభ్యుడిగా పనిచేసిన వివేక్ బెల్లంపల్లి, మంచిర్యాల, చెన్నూర్ అసెంబ్లీ నియోజకవర్గాల అభివృద్ధికి ఎంతగానో కృషి చేశారని గుర్తు చేశారు. కాకా గడ్డం వెంకటస్వామి కాంగ్రెస్ అభివృద్ధికి చేసిన కృషికి గుర్తింపుగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గడ్డం వినోద్, వివేక్‌లకు మంత్రివర్గంలో స్థానం కల్పించాలని పేర్కొన్నారు. నిర్లక్ష్యం చేయడం తగదన్నారు. సమావేశంలో అసెంబ్లీ నియోజకవర్గ అధ్యక్షుడు ఎరుకల శ్రీనివాస్, మహిళ విభాగం నియోజకవర్గ అధ్యక్షురాలు లింగాల అమృత, జిల్లా ఉద్యోగ సంఘాల అధ్యక్షుడు గుర్రాల ప్రదీప్‌కుమార్, పట్టణ కార్యదర్శి కంది రవికుమార్, ఉపాధ్యక్షురాలు రవళి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాల మహానాడు నాయకులు

బీసీలకు ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవాలి

- బీసీ ఐక్యవేదిక నాయకుల డిమాండ్

పాతమంచిర్యాల: తెలంగాణలో కొలువుదీరిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం బీసీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడానికి చర్యలు చేపట్టాలని బీసీ ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో శనివారం బీసీ ఐక్య వేదిక సమన్వయ సమావేశం నిర్వహించారు. తెలంగాణలో బీసీ జనగణన చేపట్టి జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు పెంచుతామని ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. బీసీ వర్గాల సామాజిక న్యాయం గురించి మాట్లాడని పార్టీలను ప్రజలు తిరస్కరించారన్నారు. బీసీ ఎజెండాకే ప్రజలు ఓటు వేశారన్నారు. కార్యక్రమంలో బీసీ ఐక్య వేదిక జిల్లా కన్వీనర్ వడ్డెపల్లి మనోహర్, సామాజిక న్యాయవేదిక జిల్లా కన్వీనర్ రంగు రాజేశం, నాయకులు కనుకుట్ల మల్లయ్య, పెద్దపల్లి కోటిలింగం, సమ్ము రాజన్న, సోమన్న, భూమన్న, మేరు సంఘం నాయకులు మాడిశెట్టి విశ్వం, గాండ్ల తేలికుల సంఘం జిల్లా అధ్యక్షుడు బుద్ది చంద్రమౌళి పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న బీసీ సంఘం నాయకులు

విజయవంతం చేయండి

జైపూర్: నస్పూర్ పట్టణంలో గల నర్సయ్య భవన్‌లో ఆదివారం సాయంత్రం నిర్వహించనున్న మైనింగ్ స్టాఫ్ జనరల్ బాడీ సమావేశాన్ని జైపూర్ మండలం ఐకే1ఏ, ఓసీపీ కార్మికులు విజయవంతం చేయాలని ఏఐటీయూసీ మైనింగ్ స్టాఫ్ బీపీఏ రీజియన్ కార్యదర్శి వంగరి రాజేశ్వర రావు, శ్రీరాంపూర్ ఏరియా నాయకులు బాలకృష్ణ, శంకరయ్య, సదయ్య శనివారం కోరారు. మైనింగ్‌స్టాఫ్ కార్మికుల సమస్యల పరిష్కారానికి నిర్వహించనున్న సమావేశానికి ముఖ్యఅతిథిగా ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధానకార్యదర్శి కొమిడి రాజ్‌కుమార్ రావడం జరుగుతుందని కావున కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

ప్రభుత్వ భూమిని కాపాడండి..!



మందమర్రిరూరల్: మందమర్రి పట్టణంలోని మార్కెట్ నడిబొడ్డులో గల స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైదరాబాద్(ఎస్బీఐ) ఎదుట ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూమిని కాపాడాలని స్థానికులు కోరుతున్నారు. ఈ స్థలంలో ఇదివరకే రెండు సార్లు ఓ వ్యాపారి తనకు సంబంధించిన స్థలమని అక్రమ నిర్మాణానికి పూనుకోగా, స్థానికుల ఫిర్యాదు మేరకు మున్సిపల్ కమిషనర్ రాజు అడ్డుకున్నారు. గతంలో ఈ ఖాళీ స్థలంలో ప్రభుత్వ భూమి అనే సూచన బోర్డు ఉండేది. ఈ మధ్య ఆ బోర్డును సైతం పీకేసారు. ప్రస్తుతం ఆ ఖాళీ స్థలంలో ఎలాంటి హెచ్చరిక బోర్డు కూడా లేదు. విలువైన ఆ ఖాళీ స్థలాన్ని మరొకరు కబ్జా చేయకుండా అడ్డుగోడ కట్టి కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

ఘనంగా మండల పడిపూజ



పడి పూజలు చేస్తున్న స్వాములు



అగ్ని గుండాల ప్రవేశం చేస్తున్న స్వాములు

శ్రీరాంపూర్: స్వాములు, భక్తుల అయ్యప్ప నామస్మరణతో శ్రీరాంపూర్ కాలనీ మారుమోగింది. కాలనీలోని హనుమాన్ మందిరంలో శుక్రవారం రాత్రి అయ్యప్ప మండల మహా పడిపూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అఖిల భారతీయ అయ్యప్ప ప్రచార సభ శ్రీరాంపూర్ అధ్యక్షుడు బొడ్డు లక్ష్మణ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున స్వాములు పాల్గొన్నారు. 108మంది మాతలతో ఆర్కే8 కాలనీ గణేష్ మందిరం నుంచి పురవీధుల్లో అయ్యప్ప నామ పాటలు పాడుతూ, పేటతుల్లి నృత్యాలతో శోభాయాత్ర నిర్వహించుకుంటూ పూజా కార్యక్రమం వద్దకు తరలివచ్చారు. కేరళకు చెందిన సంజీవనముద్రి స్వామి ఆధ్వర్యంలో ఈ పూజా కార్యక్రమాలు జరిగాయి. అనంతరం స్వాముల అగ్నిగుండాల ప్రవేశ కార్యక్రమాన్ని నిర్వహించారు. మంచిర్యాల మార్వాడి కాలు భజన బృందం ఆలపించిన భక్తి గీతాలు ఆకట్టుకున్నాయి. మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు గడ్డం అరవింద్ రెడ్డి, నడిపల్లి దివాకర్‌రావు, మాజీ జెడ్పీటీసీ రాచకొండ వెంకటేశ్వర్లు భక్తులకు, స్వాములకు అన్నదానం చేశారు. చుట్టుపక్క ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున అయ్యప్ప స్వాములు, భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. కార్యక్రమంలో అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచార సభ రాష్ట్ర అధ్యక్షుడు బేతి తిరుమలరావు, ప్రధాన కార్యదర్శి భాస్కర్ రాజేశం, ఏరియా అధ్యక్షుడు బొడ్డు లక్ష్మణ్, సలహాదారులు వెంకటేశం ఉపాధ్యక్షులు శివకుమార్, రవికృష్ణ, సురేందర్, రాజేష్, అయ్యప్ప సేవా సమితి శ్రీరాంపూర్ అధ్యక్షుడు లక్ష్మణ్‌తో పాటు క్రాంతి, ప్రసాద్, రమేశ్, శివారెడ్డి, రంజిత్, ఐలయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సోనియాగాంధీ జన్మదిన వేడుకలు



రామకృష్ణాపూర్: కేక్ కట్ చేస్తున్న నాయకులు



దండేపల్లి: వేడుకల్లో ఎంపీపీ, ఎంపీటీసీలు

- ఊరూరా కేక్ కట్ చేసి, పండ్లు పంచి సంబురాలు చేసుకున్న కాంగ్రెస్ నాయకులు

దండేపల్లి/చెన్నూర్/భీమిని/జైపూర్/నెన్నెల/భీమారం/రామకృష్ణాపూర్/నస్పూర్/కాసిపేట/చెన్నూర్‌రూరల్/లక్సెట్టిపేట/జన్నారం/మందమర్రిరూరల్/తాండూర్: కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ జన్మదిన వేడుకలను పట్టణంలో శనివారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రాల్లోని, పట్టణ కాంగ్రెస్ పార్టీ కార్యాలయాల్లో నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి స్వీట్లు పంచిపెట్టారు. ఆమె చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఏరియా ఆసుపత్రిలో ఐఎన్టీయూసీ నాయకులు రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రఘునాథ్‌రెడ్డి, పల్లెరాజు, అబ్దుల్‌అజీజ్, గోపతిరాజయ్య, శ్యామ్‌గౌడ్, యాకూబ్‌అలీ, మహంకాళి శ్రీనివాస్, కనకరాజు, భీమారం మండలకమిటీ అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, నెన్నెల మండల అధ్యక్షుడు గట్టు మల్లేష్, జైపూర్‌లో జిల్లా ప్రధాన కార్యదర్శి రిక్కుల శ్రీనివాస్‌రెడ్డి, మండల అధ్యక్షుడు ఫయాజ్, భీమిని, కన్నెపల్లి మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు దాగం లక్ష్మీనారాయణ, రామాంజనేయ, నస్పూర్‌లో మున్సిపల్ కాంగ్రెస్ ఫ్లోర్‌లీడర్ సురిమిల్ల వేణు, కౌన్సిలర్లు బొద్దున సంధ్యారాణి, జిల్లా మైనార్టీ అధ్యక్షుడు ఎండి ఖలీద్, జిల్లా యూత్ అధ్యక్షుడు సంపత్‌రెడ్డి, డీసీసీ జనరల్ సెక్రటరీ భూపతి శ్రీనివాస్, కాసిపేటలో ఎంపీటీసీలు పార్వతి మల్లేష్, భీంరావు, జన్నారం మండల అధ్యక్షుడు ముజాఫర్ అలీఖాన్, మందమర్రి కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు నోముల ఉపేందర్‌గౌడ్, తాండూర్ మండల అధ్యక్షుడు ఈసా, ఎంపీటీసీ సిరంగి శంకర్, సింగిల్ విండో వైస్ చైర్మన్ కడారి రత్నాకర్‌రావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గట్టు మురళీధర్ రావు, దండేపల్లిలో ఎంపీపీ గడ్డం శ్రీనివాస్, ఎంపీటీసీలు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'మహాలక్ష్మి'కి విశేష స్పందన

మంచిర్యాలరూరల్(హాజీపూర్): కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆరు గ్యారంటీల్లో నుంచి మహాలక్ష్మి, చేయూత పథకాలను శనివారం సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. ఇందులో భాగంగా జిల్లాలో కలెక్టర్ సంతోష్, జిల్లా రవాణా శాఖా అధికారి కిష్టయ్య, బస్ డిపో మేనేజర్ రవీంద్రనాథ్ కలిసి ప్రారంభించిన మహాలక్ష్మి పథకానికి హాజీపూర్‌లో విశేష స్పందన లభించింది. మహిళలకు ఆర్టీసీలో ఉచిత బస్సు ప్రయాణం కల్పించడంతో హాజీపూర్ మండలంలోని వేంపల్లి నుంచి దొనబండ వరకు ఉన్న బస్టాండ్‌ల వద్ద తమ గమ్యస్థానాలకు చేరుకునేందుకు వేచి ఉన్న మహిళలు ఉచిత బస్సు ప్రయాణాన్ని వినియోగించుకుని సంతోషం వ్యక్తం చేశారు. అన్ని రకాల నిత్యావసర సరుకులు ఇతరత్రా ధరలు ఆకాశన్నంటుతున్న తరుణంలో మహిళలకు ప్రభుత్వం కల్పించిన ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం తమకు ఎంతో ఊరటనిస్తోందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణంతో మిగులు డబ్బులను పొదుపుగా మార్చుకుని ఇతర అవసరాలకు వినియోగించుకునేలా తోడ్పాటు అందుతుందని కూడా మహిళలు తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు.



మహిళకు స్వీట్ తినిపిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మహిళలకు స్వీట్లు పంచి... బస్సు ఎక్కించి
జన్నారం: ఆరు గ్యారంటీలలో శనివారం కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకం ప్రారంభించిన నేపథ్యంలో జన్నారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బస్టాండ్‌లో మహిళలకు స్వీట్లు పంచి, బస్సు ఎక్కించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ నేపథ్యంలో పలువురు మహిళలు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ముజాఫర్ అలీఖాన్, మాజీ ఎంపీపీ శంకరయ్య, నాయకులు ఇసాక్, సుధాకర్‌నాయక్, లక్ష్మి, పంకజ, తదితరులు పాల్గొన్నారు.

మహిళల హర్షం
మందమర్రిరూరల్: హామీల్లో భాగంగా 'మహాలక్ష్మి' పథకం ద్వారా మహిళలకు ఆర్టీసీ బస్‌లో ఉచిత ప్రయాణం కల్పించడం హర్షనీయమని కాంగ్రెస్ పార్టీ నాయకురాళ్లు పేర్కొన్నారు. పార్టీ నాయకురాళ్లతో పాటు పలువురు మహిళలు శనివారం ఉచిత ప్రయాణం చేశారు.

'మా ఊరికి బస్సు నడపండి'

కాసిపేట: మండలంలోని సోనాపూర్ గ్రామపంచాయతీ పరిధిలో కొన్ని నెలల నుంచి ఆర్టీసీ బస్సు రావడం లేదని, వెంటనే పునరుద్ధరించాలని ఆదివాసీలు కోరారు. రాష్ట్రంలో నూతనంగా ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్టీసీ బస్సులలో మహిళలకు ఉచితంగా ప్రయాణం ప్రారంభించడం సంతోషించదగిన విషయమని ఆదివాసీ గూడాల్లో బస్సు సౌకర్యం లేకపోవడం బాధాకరమన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి ఆదివాసీ గ్రామాల్లో బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఆదివాసీ సేన మండల ప్రధాన కార్యదర్శి సిడాం గణపతి, ఉపాధ్యక్షుడు పేంద్రం ప్రభాకర్, మోతిరాం, మోహన్, సంపత్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



నడిపించాలని కోరుతున్న గత్రావ్‌పల్లి గ్రామస్తులు

బస్సు సౌకర్యం కల్పించాలి
భీమిని: మండలానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని శనివారం భీమిని మండల కాంగ్రెస్ నాయకులు ఆర్టీసీ అధికారులకు వినతిపత్రం అందజేశారు. బెల్లంపల్లి నుంచి భీమిని మండలంలోని తెనుగుపల్లి గ్రామం వరకు ఉదయం, సాయంత్రం బస్సు నడిపించాలని పేర్కొన్నారు. దీంతో విద్యార్థులతో పాటు ప్రజలకు రవాణా సౌకర్యం ఏర్పడుతుందన్నారు. అధికారులు వెంటనే ఆర్టీసీ బస్సును నడిపించాలన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో రాంటెంకి దశరథ్, శ్రావణ్‌కుమార్, రవి, రాజు ఉన్నారు.



భీమిని: వినతిపత్రం ఇస్తున్న కాంగ్రెస్ నాయకులు